## క్లుప్తంగా

### పోలమాంబ జాతరకు సన్నాహాలు



ఆలయంలో సమావేశమైన కమిటీ పెద్దలు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు సంజయ్ గాంధీ కాలనీలో గ్రామదేవత పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహణకు ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు సన్నాహాలు చేస్తున్నారు. ఆదివారం ఆలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 11 నుంచి 15 వరకు ఉత్సవాలు జరపాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లు, నిర్వహించాల్సిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆలయ అలంకరణ తదితర వాటి గురించి చర్చించారు. సమావేశంలో ఆలయం ధర్మకర్త కంచుమర్తి నాగరాజు, అధ్యక్షుడు ఒమ్మి రాజు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

### అభిమానం చాటుకున్నారు..



వంగవీటి రంగా విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న అభిమానులు

ఆరిలోవ: ఆరిలోవలో వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని కొందరు శుభ్రం చేసి అభిమానం చాటుకున్నారు. సాధారణంగా రాజకీయ నాయకుల విగ్రహాలకు జయంతి, వర్ధంతి సందర్భంగా మాత్రమే ఆయా పార్టీల నాయకులు దుమ్ము దులిపి పూలమాలలు వేసి వదిలేస్తారు. మళ్లీ ఆ సందర్భంగా వచ్చేంతవరకు ఆ విగ్రహం ఎలా ఉన్నా అటువైపు కన్నెత్తి కూడా చూడరు. వీరు మాత్రం తమ నాయకుడిపై అభిమానంతో విగ్రహాన్ని శుభ్రం చేశారు. వంగవీటి జయంతి సందర్భంగా గతేడాది ఇక్కడ ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి దుమ్ముతోపాటు పక్షులు వ్యర్థాలతో ఈ విగ్రహం అస్తవ్యస్తంగా మారింది. ఆయన అభిమానులు కొందరు స్పందించి ఎలాంటి సందర్భంగా లేకపోయినప్పటికీ ఆదివారం నీటితో విగ్రహాన్ని శుభ్రం చేశారు. స్థానికులు వీరిని అభినందించారు.


### యువకుల రక్తదానం



రక్తదానం చేసిన యువతను అభినందిస్తున్న విన్సెంట్ రాజ్‌కుమార్

మద్దిలపాలెం: యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి మరొకరికి ప్రాణదాతలుగా నిలవాలని లండన్ మిషన్ మెమోరియల్ చర్చ్ సంఘ కాపరి విన్సెంట్ రాజ్‌కుమార్ అభిలషించారు. సంఘం ఆధ్వర్యంలో ఎ.ఎస్.రాజా బ్లడ్ బ్యాంక్‌తో కలిసి ఆదివారం మద్దిలపాలెంలో మహా రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన యువతను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. శిబిరంలో 24 మంది యువకులు రక్తదానం చేయడం ఆదర్శనీయమన్నారు. ప్రతి ఏడాది వేసవిలో రక్తదాన శిబిరాలు విధిగా చేపడుతున్నామన్నారు. అధిక సంఖ్యలో యువత భాగస్వాములు కావాలని రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సంఘ కాపరి ఇమ్మానుయేల్, కోశాధికారి డేనియల్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సదానందా మోజెస్, యూత్ సెక్రటరీ హెన్నీ జస్టిన్ తదితరులు పాల్గొన్నారు.

### అలరించిన హాస్యామృతం



కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: హాస్యప్రియ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో హాస్యామృతం పేరిట ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం ప్రదర్శించిన కామెడీ స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. క్లబ్ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, కార్యదర్శి ఇమంది ఈశ్వరరావు ఆధ్వర్యంలో కళాకారులు పి.కె. దుర్గారావు, అల్లాడ నాగరాజు, సీహెచ్ నాగార్జున, పి.ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రమేష్, వీరేంద్ర, రమ, సీత, ప్రావీణ్య, మల్లిక, పుష్యమి ప్రదర్శించిన స్కిట్స్ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి.

# ఏళ్లుగా ఎదురుచూపులు



స్థానిక రజకులు సొంతంగా ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక దోబీఖానాలు





ఊటగెడ్డ ప్రాంతంలో ఉన్న ఏకైక శాశ్వత దోబీఖానా

- సరిపడా దోబీఖానాలు లేక ఇబ్బందులు పడుతున్న రజకులు
- వందల రజక కుటుంబాలకు ఒక్కటే ఆధారం
- మరొకటి శాశ్వతంగా ఏర్పాటు చేయాలని ఊటగడ్డ వాసుల విజ్ఞప్తి

బీచ్ రోడ్డు: ఆ ప్రాంతంలో వందల సంఖ్యలో రజక కుటుంబాలు నివసిస్తున్నాయి. వారిలో అత్యధికులు తమ కులవృత్తిని చేసుకుంటూ జీవిస్తున్నారు. ఏళ్ల తరబడి అదే ప్రాంతంలో కులవృత్తి చేసుకుంటున్న వారు సరైన దోబీ ఖానా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వందల కుటుంబాలు ఉంటున్న ప్రాంతానికి ఒకే ఒక్కటి శాశ్వత దోబీ ఖానా ఉంది. మరొకటి నిర్మించి తమను ఆదుకోవాలని జీవీఎంసీ 28వ వార్డు దసపల్లా హిల్స్ వెనుక ఉన్న ఊటగడ్డ ప్రాంత వాసులు కోరుతున్నారు.

**500 రజక కుటుంబాలు**

ఊటగడ్డను ఆనుకొని రెండు వైపులా 500 రజక కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇక్కడ ఒకటే దోబీ ఖానా ఉండటం వల్ల దుస్తులు ఉతుక్కునేందుకు తీవ్ర పోటీ నెలకొంటుంది. దీంతో వారి కులవృత్తిని కొనసాగించలేక రజకులు ఇబ్బందులు పడుతున్నారు. తమకు మరో శాశ్వత దోబీ ఖానా నిర్మించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

**రెండేళ్లుగా కౌన్సిల్లో ప్రస్తావన**

ఊటగడ్డ రజక కుటుంబాల కులవృత్తి సమస్య పరిష్కారం కోసం వార్డు కార్పొరేటర్ పల్ల అప్పలకొండ రెండేళ్లలో అనేక సార్లు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావించారు. ప్రతిసారి వార్డు అభివృద్ధిలో భాగంగా ఊటగెడ్డ ప్రాంతంలో మరో దోబీ ఖానా నిర్మిస్తామని చెబుతున్నా.. ఉన్నతాధికారులు రెండేళ్ల గడుస్తున్నా సరే ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో తమ సమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు దొరుకుతుందా అని రజక కుటుంబాలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాయి.

**మరో దోబీ ఖానా అవసరం**

ఊటగెడ్డలో వందల రజక కుటుంబాలు కులవృత్తి సాగిస్తుండటంతో ఇక్కడున్న ఒకే ఒక్క దోబీ ఖానా సరిపోవడం లేదు. తాత్కాలికంగా దోబి ఖానాలు ఏర్పాటు చేసుకొని కులవృత్తి సాగిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ ప్రాంతంలో నీటి సమస్యల లేకుండా మరో శాశ్వత దోబి ఖానా నిర్మిస్తే కుటుంబాన్ని పోషించుకుంటామని స్థానిక రజకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### నిరీక్షణ.. ఆవేదన

ఏళ్ల తరబడి కులవృత్తి చేసుకుంటూ జీవిస్తున్న స్థానిక రజకులు మరో శాశ్వత దోబీ ఖానా కావాలని ఉన్నతాధికారుల చుట్టూ ప్రదర్శనలు చేస్తున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కులవృత్తి చేయలేక, బయట పనులకు వెళ్ల లేక కుటుంబ పోషణ కష్టంగా మారిందని వాపోతున్నారు. ఏళ్లుగా మరో దోబీ ఖానా కోసం ఎదురుచూస్తున్నా.. తమ గోడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### శాశ్వత దోబీ ఖానా నిర్మించాలి



మా ప్రాంతంలో వందల రజక కుటుంబాలు ఉన్నాయి. మేమంతా కులవృత్తి చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. ఒకే ఒక్క శాశ్వత దోబీ ఖానా ఉండటంతో అందరం వినియోగించుకోవడం కష్టంగా ఉంటుంది. మరో శాశ్వత దోబీ ఖానా నిర్మించాలని అధికారులను కోరుతున్నాం.

– పి.రమణ, ఊటగెడ్డ

### కులవృత్తే జీవనాధారం



మేము చాలా ఏళ్ల నుంచి ఇక్కడే కులవృత్తి చేసుకుంటూ జీవిస్తున్నాం. ఇదే మా జీవనాధారం. ఊటగెడ్డలో సరిపడే దోబీ ఖానాలు లేక మేము మా వృత్తిని కొనసాగించడానికి ఇబ్బంది పడుతున్నాం. మా ప్రాంతంలో మరో శాశ్వత దోబీ ఖానా ఏర్పాటు చేసి రజక కులవృత్తిదారులను ఆదుకోవాలి.

– ఎం.లక్ష్మి, స్థానికురాలు

### ఇద్దరు ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్

ఎంవీపీకాలనీ: వాహనాల దొంగతానికి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను ఎంవీపీ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఈ నెల 19వ తేదీ రాత్రి పెదజాలరిపేటకు చెందిన తుపాకుల వంశీకృష్ణ తన హుండా యాక్టివా వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేశాడు. తెల్లవారుజామున నిద్రలేచి చూడగా వాహనం కనిపించలేదు. ఎవరో వాహనాన్ని దొంగిలించారని నిర్ధారించుకొని ఎంవీపీ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరు వ్యక్తులపై అనుమానం ఉందని చెప్పడంతో పోలీసులు ఎంవీపీ సెక్టార్-11లో వారిని 22వ తేదీన అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని విచారించడంతో నేరం అంగీకరించారు. ఎంవీపీ కాలనీ, భీమిలి, త్రీటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు ద్విచక్ర వాహనాలతో పాటు ఒక ల్యాప్‌టాప్, రెండు సెల్‌ఫోన్లు దొంగిలించినట్లు వెల్లడించారు. రూ.2,20,000 విలువ చేసే ఆయా వస్తువులను వారి నుంచి స్వాధీనం చేసుకొని, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోండి



దీక్షలో పాల్గొన్న కో ఆర్డినేషన్ కమిటీ నాయకులు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపడుతున్న 1,455వ రోజు రిలే దీక్షలో ఆదివారం డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో నేవల్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరి విడనాడాలన్నారు. ఎంతో మంది ప్రాణాల బలిదానంతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. నేవల్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీ జి. అరుణ్‌కుమార్, భానోజీ బిల్లా, సుదర్శన్, మోహన్, కో ఆపరేటివ్ సెక్రటరీ వై. రాజేష్, మీసాల సురేష్, నాగన్న దొర, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ ఆశయాలు కొనసాగిద్దాం



భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న ఆటో స్టాండ్ కార్మికులు, సీపీఎం నాయకులు



మద్దిలపాలెంలో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

ఆరిలోవ: దేశం కోసం అతి చిన్న వయసులో ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్ ఆశయాలు కొనసాగించాల్సిన బాధ్యత యువతపై ఉందని సీపీఎం నాయకుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ అన్నారు. దీన్‌దయాల్‌పురం వద్ద బీఆర్‌టీఎస్ కూడలి పక్కన భగత్ సింగ్ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో ఆదివారం భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ చిత్రపటాలకు సీపీఎం నాయకులతో కలసి ఆటో యూనియన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో దేశం నుంచి బ్రిటిష్ వారిని వెళ్లగొట్టాలనే ఆశయంతో భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌లు పోరాడారన్నారు. కార్యక్రమంలో ఆటో సంఘం నాయకులు రాజేష్, అప్పన్న, బాబూరావు, లక్ష్మణరావు, సతీష్, నాగ భాస్కర్, సీపీఎం నాయకుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**భగత్‌సింగ్‌కు నివాళి**

జీవీఎంసీ 10వ వార్డు బీఎస్‌ఆర్ నగర్‌లో భగత్‌సింగ్ చిత్ర పటానికి సీపీఎం నాయకులు, స్థానికులు పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, డి.నాగరాజు, చంద్రమౌళి, సూరిబాబు, అన్నపూర్ణ, నారాయణరావు పాల్గొన్నారు.

**విప్లవ వీర కిశోరం**

మద్దిలపాలెం: అఖిల భారత యువజన సమాఖ్య సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మద్దిలపాలెంలోని కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మధురెడ్డి మాట్లాడుతూ భయమెరుగని భారతీయుడు, భరతమాత ముద్దుబిడ్డ, విప్లవ వీర కిశోరం భగత్ సింగ్ అని కొనియాడారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో ఉన్న ప్రతి పౌరుడికి ఉచిత విద్య, వైద్యం, ఉపాధి అందించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ మెంబర్ రావి అశోక్, నాయుడు, సోను సింగ్, శ్రీను పాల్గొన్నారు.

**యోధుల త్యాగాలు నిరుపమానం**

ఏయూక్యాంపస్: స్వాతంత్య్ర సముపార్జనలో తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాలు నిరుపమానమని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్(ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా బీచ్ రోడ్డులోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని యువతరం దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. దేశంలో నిరుద్యోగ యువతను దృష్టిలో ఉంచుకుని భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్‌ను తీసుకురావాలని డిమాండ్ చేశారు. దేశంలో విద్యా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలకు శ్రీకారం చుడతామన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు అభిషేక్, మాజీ అధ్యక్షులు శ్రీను, గ్రేస్ ప్రకాష్, రమేష్, ఆదర్శ్, లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.



బీచ్ రోడ్డులో భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

## కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

ఎంవీపీకాలనీ: మద్దిలపాలెం డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ కళాశాల రోడ్డులో గుర్తుతెలియని కారు ఢీకొట్టడంతో సుంకర అప్పారావు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా.. సుంకర అప్పారావు ఆదివారం ఉదయం వాకింగ్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో కృష్ణా కాలేజీ రోడ్డులో వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి ఒక కారు ఢీకొట్టడంతో గాయపడ్డాడు. అనంతరం కారు డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. చుట్టుపక్కల వారు క్షతగాత్రుడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం తీవ్రగాయాలైన అప్పారావు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ధనుంజయ్ నాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



సంఘ నూతన కార్యవర్గ సభ్యులు

మద్దిలపాలెం: ఇసుకతోటలోని శ్రీకృష్ణా ఉమామహేశ్వర సాయిదుర్గా యాదవ సేవా సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరిగాయి. గౌరవ అధ్యక్షులుగా గొలగాని అప్పారావు, బొట్ట శివ, ఈగల సత్యం ఎన్నికవగా.. సంఘ అధ్యక్షుడిగా ఒమ్మి శ్రీనివాసరావు, ఉపాధ్యాక్షుడిగా ప్రసాది అప్పారావు, పల్లా అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా ఒమ్మి గోపికృష్ణ(నాయుడు), సహాయ కార్యదర్శిగా ముర్వల శ్రీను, ముగడ శేఖర్, కోశాధికారిగా గొలగాని రాజు, సహా కోశాధికారిగా గొలగాని శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఒమ్మి గోపినాథ్, కాకర రాములు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు స్థానిక దుర్గమాంబ ఆలయంలో అమ్మవారిని, ఉమామహేశ్వరాలయంలో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## జీవీఎంసీకి వీల్ చైర్ల వితరణ

సీతంపేట: వింటేజ్ విశాఖ కార్యవర్గ సమావేశం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం జరిగింది. సంస్థ అధ్యక్షురాలు ఎ.హైమావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంస్థ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా సంస్థ తరపున జీవీఎంసీ స్పందన కార్యక్రమానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగుల కోసం రెండు వీల్ చైర్లు జీవీఎంసీ డీసీపీ టి.జి.రామ్మోహన్‌రావుకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి జి.మోహన్ కృష్ణ, సురేష్ ఖన్నా, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి లైబ్రేరియన్లకు వర్క్‌షాప్



వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు తదితరులు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈ నెల 24 నుంచి 28 వరకు లెర్నింగ్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాలల లైబ్రేరియన్లకు వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. కార్యక్రమ పోస్టర్‌ను ఆదివారం కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ఆవిష్కరించి, వివరాలు వెల్లడించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ వర్క్‌షాప్‌ను గుజరాత్ వారి సహాయ సహకారాలతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న గ్రంథాలయాధికారులకు ఉపయోగపడేటట్లు శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## వెండింగ్ నేమ్ బోర్డుల తొలగింపు సరికాదు



మాట్లాడుతున్న తోపుడుబండ్ల కార్మికులు

మద్దిలపాలెం: మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్, ఆర్టీసీ డిపో వద్ద తొలగించిన వెండింగ్ నేమ్ బోర్డులను తిరిగి అదే స్థలంలో ఏర్పాటు చేయాలని మద్దిలపాలెం జోన్ తోపుడుబండ్ల కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరావు డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తప్పుడు ఫిర్యాదులపై విచారణ లేకుండా టీవీసీ కమిటీ ఆమోదంతో ఏర్పాటు చేసిన వెండింగ్ బోర్డులు తీసేయడం సరికాదన్నారు. వీటిని తొలగించడానికి అనుమతి ఇచ్చిన జీవీఎంసీ జోన్-3 కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. జోన్-3లో 2014 స్ట్రీట్ వెండర్స్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. విశాఖ జిల్లా తోపుడు బండ్ల కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, మాజీ టీవీసీ కమిటీ సభ్యుడు ఎ.సింహాచలం మాట్లాడుతూ ఆర్కే బీచ్ పార్క్ హోటల్ ఫుట్‌పాత్‌పై, వీఎంఆర్‌డీఏ పార్క్ ఫుట్‌పాత్‌పై బీచ్ తోపుడు బండ్ల సంఘం నాయకులు డబ్బులు తీసుకొని తోపుడుబండ్లు పెట్టిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వెండింగ్ జోన్లలో అవసరమైన సౌకర్యాలను నేటికీ కల్పించలేదని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ మద్దిలపాలెం జోన్ నాయకురాలు కె.కుమారి, సీఎంఆర్ సెంట్రల్ తోపుడుబండ్ల నాయకులు చిన్ని, జి.శ్రీను, ఎల్లమ్మ నాయుడు, మద్దిలపాలెం సెంటర్ నాయకులు సింహాద్రి, కోలా శ్రీను, తోపుడుబండ్ల కార్మికులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధిలో కళాకారుల పాత్ర కీలకం


- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



అవార్డులు అందుకున్న కళాకారులతో అతిథులు, నిర్వాహకులు

తాటిచెట్లపాలెం: దేశాభివృద్ధి, సమాజాభివృద్ధిలో కూడా కళాకారులది సుస్థిర స్థానమని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఆదివారం రైల్వేన్యూకాలనీలో గల సుబ్బలక్ష్మీ కల్యాణ మండపంలో విశాఖ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కళాప్రవీణ 2025 ఉగాది పురస్కారాల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులు అనేక రూపాల్లో ప్రజలకు వినోదం కలిగించడంతో పాటు ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై కూడా అవగాహన కల్పిస్తున్నారన్నారు. అలాంటి కళాకారులను సత్కరించడం సంతోషించదగిన విషయమన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన కళాకారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లడుతూ గత కొన్నేళ్లుగా పలువురు కళాకారులకు ప్రతి ఏటా ఉగాది పర్వదినాన అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. 16 మంది కళాకారులను ఘనంగా సత్కరించారు. ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కంచర్ల అచ్యుతరావు, కళాకారుల సంఘం అధ్యక్షుడు కె. జనార్ధన్, గౌరవ సలహాదారు ఆర్. నాగరాజ్ పట్నాయక్, ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బి.కె. రామేశ్వరి, కళాకారుల సంఘం ప్రతినిధులు యాదగుమార్, శివజ్యోతి, కన్నం రమణారావు, ధనుంజయ్, మనోహర్ పాల్గొన్నారు.


## మానవ హక్కుల కోర్టులు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఆచార్య సత్యనారాయణ

అల్లిపురం: మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993, సెక్షన్ 30 ప్రకారం ప్రతి జిల్లాలో మానవ హక్కుల కోర్టులు ఏర్పాటు చేయాల్సి అలా జరగడం లేదని మానవ హక్కుల కౌన్సిల్ గౌరవాధ్యక్షుడు ఆచార్య వై.వై.సత్యనారాయణ అన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో దామోదర్ సంజీవయ్య జాతీయ లా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదివారం మానవ హక్కుల కోర్టుల ఏర్పాటుపై జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమ్మతితో ప్రతి జిల్లాలో ఒక సెషన్సు కోర్టును మానవ హక్కుల న్యాయస్థానంగా ఏర్పాటు చేసినా బాధితులకు సత్వర న్యాయం లభించడం లేదన్నారు. కాకినాడ జిల్లా మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు హబీబ్ బాషా, గుండు అప్పలరాజు, వీఎస్ఎన్ మూర్తి, నక్కాని అప్పారావు, పలువురు మాజీ పోలీసు అధికారులు, న్యాయవాదులు, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఐవీఎల్ శాస్త్రికి ఘన నివాళి



శాస్త్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు

మహారాణిపేట: సంగీత జనకులం వ్యవస్థాపకులు, దివంగత ఐవీఎల్ శాస్త్రి 98వ జయంతి సందర్భంగా డాబాగార్డెన్స్ వద్ద గల ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి కార్యాలయంలో ఆదివారం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శాస్త్రి ప్రియశిష్యులు, సంగీత విద్వాంసులు ఆకొండి వెంకటరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ముందుగా శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి మౌనం పాటించి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ సభికులను ఉద్దేశించి మాట్లాడారు. వేలాది మందికి ఉచితంగా శాస్త్రీయ సంగీతం నేర్పించిన ఘనత ఒక్క ఐవీఎల్ శాస్త్రికే దక్కుతుందన్నారు. ఆయనకు నివాళిగా శిష్య బృందం సామూహికంగా సంకీర్తన చేశారు. ఈ కార్యక్రమంలో ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి సంస్థ ప్రతినిధులు ఎ. వెంకటరావు, కె. సుబ్రహ్మణ్యం, పి. జగన్‌మోహనరావు, వి. మధుసూదనరావు, గణేష్, మధుబాబు, మహేశ్వరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కంటి ఆరోగ్యంపై అవగాహన




ఆప్టోమెట్రీ వారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు, సిబ్బంది

ఏయూక్యాంపస్: ప్రపంచ ఆప్టోమెట్రీ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం బీచ్ రోడ్డులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెంచూరియన్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు బీచ్ రోడ్డులోని కురుసుర మ్యూజియం వద్ద ఫ్లాష్‌మాబ్, లఘు నాటిక ప్రదర్శించారు. వర్సిటీ బోధన సిబ్బంది, విద్యార్థులు కంటి ఆరోగ్యంపై స్థానికులు, సందర్శకులకు అహగాహన కల్పించారు. కాటరాక్ట్, కంటి సమస్యలపై, గ్లుకోమా తదితర వ్యాధుల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఆప్టోమెట్రీ విభాగం డీన్ డాక్టర్ కె.విజయబాబు, విభాగాధిపతి ఎం.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.